## తిరుమల తొలిగడప

# దేవుని కడప

రచన

డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

2022

**Tirumala Tholi Gadapa**

# DEVUNI KADAPA

**Written by**
**Dr. I.L.N. Chandrasekhar Rao**

T.T.D. Religious Publications Series No. 1424

© All Rights Reserved

First Edition : 2022

Copies :

*Published by*
**A.V. DHARMA REDDY,** IDES,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati - 517 507

***D.T.P:***
Publications Division
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

## ముందుమాట

**"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన**
**వేంకటేశ సమో దేవో నభూతో నభవిష్యతి..."**

"ఈ బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమానమైన పుణ్య క్షేత్రమూ లేదు.. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సాటిరాగల దేవుడు భూతకాలంలో లేదు.. భవిష్యత్తులోనూ ఉండబోదు...." అని ప్రశస్తి

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారు కొలువుదీరిన ప్రధాన క్షేత్రం... బంగారుగడప అయిన తిరుమల కొండే అయినా.. స్వామి వారికి తెలుగు నేల నలుచెరుగులా అనేక క్షేత్రాలు.. ఆలయాలు వున్నాయి. అన్నిక్షేత్రాల్లోనూ... ఆలయాల్లోనూ తెలుగువారి ఇలవేల్పుగా... కలల పందిరిగా స్వామివారు భక్తుల ఆరాధనలందుకుంటూ వున్నారు. తెలుగు నేలపై శ్రీ వేంకటేశ్వరస్వామి వారు కొలువు దీరిన క్షేత్రాల్లో కొన్ని తిరుమల క్షేత్రంతోనూ, తిరుమల శ్రీ వేంకటేశ్వర సామివారితోనూ సంబంధం కలిగిన క్షేత్రాలుగా పేరుపొందాయి. అటువంటి క్షేత్రాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వై.ఎస్.ఆర్. జిల్లాలో జిల్లా కేంద్రమైన కడప నగరంలో భాగంగా వున్న దేవుని కడప క్షేత్రం ఒకటి. " దేవుని కడప" తిరుమల తొలిగడప గా ప్రసిద్ధి చెందింది.

పూర్వం నుంచి కడపకు ఉత్తర ప్రాంతాల వారు తిరుమలకు వెళ్ళే సమయంలో ముందుగా దేవుని కడపను దర్శించుకుని వెళ్ళేవారు. అందువల్ల అనాదికాలం నుంచే ఈ క్షేత్రం తిరుమల తొలిగడపగా ప్రసిద్ధి చెందినట్లు చెప్పబడుతోంది.

ప్రాచీన క్షేత్రమైన దేవుని కడప ఆలయ పాలనా బాధ్యతలను 2006వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానం స్వీకరించింది. అప్పటినుంచి

తిరుమల తిరుపతి దేవస్థానం దేవుని కడప అభివృద్ధికి శ్రీకారం చుట్టడం తోపాటు ఉత్సవాలను నిర్వహిస్తూవుంది.

అటువంటి దేవుని కడప శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ స్థలపురాణం, ఆలయ విశేషాలు, చరిత్ర, నిత్య, వార, పక్ష, నక్షత్ర, మాస, వార్షికోత్సవ విశేషాలను వివరిస్తూ డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు గారు "తిరుమల తొలిగడప – దేవుని కడప" అనే పుస్తకాన్ని అందించారు. అనేక విశేషాలతో సులభమైన సరళమైన శైలిలో వీరు రచించిన ఈ పుస్తకం తి.తి.దేవస్థానం ప్రచురణగా వెలువడుతున్నది. భక్తులు ఈ గ్రంథాన్ని పఠించి ఒక్కసారైన దేవుని కడప శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించి తరించాలని ఆకాంక్షిస్తూ....

సదా శ్రీ వేంకటేశ్వరస్వామి సేవలో

**శ్రీకార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.



# సమర్పణ

"కలౌ వేంకట నాయకః" అని తిరుమలేశునికి ఒక అద్భుతమైన ప్రతీతి వుంది. ఈ కలియుగంలో అందరికీ ఏకైక దిక్కు, పరమాగతి శ్రీ వేంకటేశ్వరస్వామే! ఆ స్వామి కొలువుదీరిన తిరుమలకు తొలిగడపగా భాసిల్లుతూ వున్న క్షేత్రం – దేవుని కడప !

కృపాచార్యులచే ప్రతిష్ఠింపబడినట్లుగా చెప్పబడి... తాళ్ళపాక అన్నమాచార్యులు, క్షేత్రయ్య వంటి సంకీర్తనా చార్యుల ఆరాధనలందుకున్న దేవుని కడప శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని గురించి 'తిరుమల తొలిగడప – దేవుని కడప' అనే ఈ పుస్తకాన్ని రాసే శక్తిని నాకు ఆ వేంకటేశ్వర స్వామే ప్రసాదించారని నా విశ్వాసం.

ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానాల ప్రచురణగా స్వీకరించి, ప్రచురింపజేస్తూవున్న తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ కార్యనిర్వహణాధికారులు అయిన శ్రీ ఎ. వి. ధర్మారెడ్డి గారికి సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వల్లూరు వీరబ్రహ్మం మరియు శ్రీమతి సదా భార్గవి గార్లకు, ప్రచురణల విభాగం చీఫ్ ఎడిటర్ ఆచార్య ఆర్.వి.ఆర్. కృష్ణశాస్త్రి గారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారములు. ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి శ్రీ రామరాజు గారికి ధన్యవాదాలు.

ఈ పుస్తక ప్రచురణ విషయమై ఎప్పుడు ఏమి అడిగినా ఓపికతో సమాధానం యిస్తూ ప్రోత్సహించిన ప్రచురణల విభాగం ఉప సంపాదకులు డా॥ నొస్సం నరసింహాచార్య గారికి కృతజ్ఞతాభినందనలు.

ఈ పుస్తక రచనలో సహకరించిన అందరికీ కృతజ్ఞతాభినందనలు.

తిరుమల తొలిగడప దేవునికడప అనే ఈ పుస్తకాన్ని శ్రీనివాసుని చరణారవిందాలకు భక్తితో సమర్పిస్తూ వున్నాను.

సదా శ్రీవారి సేవలో

**డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు**

రచయిత

కడప

28-08-2022

# దేవుని కడప

**"కలగంటిఁ గదవోయి కడపరాయ యికఁ**
**గలచకు మా సిగ్గు కడపరాయ**
**కలువల వేసే వేల కడపరాయ నీకు**
**మొలకనవ్వులతోడ మొక్కేఁ గడపరాయ"**

**- తాళ్ళపాక అన్నమాచార్యులు**

"కలౌ వేంకట నాయకః" అని అశేష భక్తుల విశేష పూజలందుకుంటూ వున్న దేవదేవుడు -

కలియుగంలో ప్రత్యక్ష భగవానుడు -
ఆర్తితో పిలిస్తే పలికే దేవుడు -
ఆదుకునే ఆపద్బాంధవుడు -
భక్తుల పాలిటి కొంగుబంగారం -
ఆపద మొక్కులవాడు -
అనాథ రక్షకుడు -
భక్తజన ప్రియుడు -
తెలుగువారి ఇలవేల్పు - కలల పందిరి -
శ్రీ వేంకటేశ్వర స్వామి!
ఆ వేల్పు కొలువు దీరిన పుణ్యస్థలం - "తిరుమల!"
అటువంటి 'తిరుమల'కు "తొలిగడప"గా భాసిల్లుతూ వున్న క్షేత్రం-

**దేవుని కడప!**

***ఈ క్షేత్రంలో కొలువుదీరిన భగవానుడు - శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి!!***

దేవుని కడప ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వై.ఎస్.ఆర్. కడప జిల్లాలో కడప నగరంలో భాగంగా కడప ప్రధాన పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది.

**గడప...**

పూర్వం కడపకు ఉత్తర ప్రాంతాలకు చెందిన వారు తిరుమల క్షేత్రానికి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి వెళ్ళే సమయంలో ముందుగా 'దేవుని కడప'కు చేరుకుని ఇక్కడి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని తర్వాత తిరుమలకు వెళ్ళేవారు. అందువల్ల తిరుమలకు 'గడప'గా... తిరుమలకు 'తొలిగడప'గా ప్రసిద్ధి చెందింది. అందువల్ల ఈ ఊరికి 'గడప' అనే పేరు ఏర్పడి అది కాలక్రమంలో 'కడప' అయినట్లు కథనం. అల్లే 'దేవుని గడప' అనేది 'దేవుని కడప' అయింది. ముందుగా దేవుని కడప శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని తర్వాత తిరుమలకు వెళ్ళే సంప్రదాయాన్ని కృపాచార్యులు ఏర్పాటు చేసినట్లు చెప్పబడుతోంది. అందువల్ల తిరుమల యాత్ర కష్టాలు లేకుండా సాగుతుందని విశ్వాసం. దీనికి తోడుగా తిరుమల వెళ్ళలేనివారు దేవుని కడప స్వామిని దర్శించుకుంటే తిరుమల ఫలం దక్కుతుందనే విశ్వాసం కూడా పూర్వం వున్నట్లు తెలుస్తోంది.

**స్థలపురాణం**

దేవుని కడపలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారు కొలువుదీరడం వెనుక స్థలపురాణ గాథలు ప్రధానంగా రెండు ప్రచారంలో వున్నాయి.

**హనుమత్ క్షేత్రం...**

తిరుమల వరాహక్షేత్రమైనట్లే... తిరుమల తొలిగడపగా ప్రసిద్ధి చెందిన దేవుని కడప హనుమత్ క్షేత్రం! శ్రీరాముడు సీతాదేవి, లక్ష్మణస్వాములతో కలిసి వనవాసం చేస్తూవున్న సమయంలో లంకాధీశుడైన రావణాసురుడు సీతాదేవిని అపహరించాడు. అనంతరం సీతాదేవిని వెదుక్కుంటూ

దండకారణ్య ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతానికి శ్రీరాముడు, లక్ష్మణులు ఇద్దరూ చేరుకున్నారు. కొంతకాలం ఈ ప్రాంతంలోనే గడిపారు. ఈ సమయంలో శ్రీరామచంద్రమూర్తికి సీతాన్వేషణలో తనకు ఒకరు సహాయం చేస్తారని స్ఫురించింది. ఆ విధంగా స్ఫురించిన రూపమే శ్రీ ఆంజనేయస్వామి! శ్రీ ఆంజనేయుడే తనకు సహాయం చేస్తాడని గ్రహించాడు. అంతే శ్రీరాముడు ఆంజనేయుడి ప్రతిరూపాన్ని తయారుచేసి ప్రతిష్ఠించాడు. అనంతరం ఈ ప్రాంతాన్ని వదిలివెళ్ళిపోయారు. అయితే ఈ ప్రాంతం నుంచి శ్రీరాముడు వదిలివెళ్ళినా ఈ ప్రాంతంలోని మహర్షులు స్వామి వారిని పూజిస్తూ వుండిపోయారు. ఈ విధంగా ముందుగా హనుమంతుడు ఈ క్షేత్రంలో కొలువుదీరడం వల్ల దీనికి "హనుమత్ క్షేత్రం" అనే పేరు ఏర్పడింది. ఇప్పటికీ గర్భాలయంలో మూలవిరాట్టు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వెనుకవైపున శ్రీ హనుమంతులవారి మూర్తి కొలువుదీరి వుండడం అందుకు నిదర్శనం. అంతే కాకుండా ఆ హనుమంతుడే ఈ క్షేత్రానికి పాలకుడు కావడం కూడా ఈ క్షేత్ర విశేషం!

## కృపాచార్యుల తిరుమల యాత్ర... స్వామి వారి ప్రతిష్ఠ!

కృపాచార్యుడు మహాభారతంలో కౌరవులకు, పాండవులకు గురువు. ప్రభుభక్తి కలవాడు. మహాభారత యుద్ధంలో కౌరవుల పక్షాన యుద్ధంలో పాల్గొన్నాడు. యుద్ధంలో కౌరవులు ఓడిపోయారు. కౌరవపక్షంలో అనేకమంది మరణించారు. యుద్ధం తర్వాత జీవించివున్న వారిలో కృపాచార్యుడు ఒకరు. కృపాచార్యుడు సప్తచిరంజీవుల్లో ఒకరు. ద్వాపరయుగంలో మహాభారత యుద్ధం ముగిసి ద్వాపరయుగం చివరిదశకు చేరుకున్న సమయంలో కృపాచార్యుడు కలియుగదైవాన్ని దర్శించి, సేవించాలని భావించాడు. కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరుడు కొలువుదీరిన తిరుమలకు హస్తినాపురం నుంచి బయలుదేరాడు. మార్గమధ్యంలో అనేక క్షేత్రాలు, తీర్థాలు దాటుకుంటూ హనుమత్ క్షేత్రానికి చేరుకున్నాడు.

హనుమంతుడిని పూజిస్తూ కొన్నిరోజులపాటు గడిపాడు. అనంతరం తిరుమలకు బయలుదేరాడు. అయితే ప్రయాణం ముందుకు సాగక హనుమత్ క్షేత్రంలోనే ఆగిపోయాడు. హనుమంతుడిని సేవిస్తూ వుండిపోయాడు. అంతేకాకుండా ఈ సమయంలోనే –

"స్వామీ! నేను మీ దర్శనం కోసమే హస్తినాపురం వదిలివచ్చాను. ఈ ప్రాంతానికి చేరుకున్నాను. ఇక్కడి నుంచి ముందుకు కదలలేకపోతూ వున్నాను. స్వామీ! నన్ను కరుణించు. మీ దర్శనభాగ్యాన్ని నాకు ప్రసాదించు...!" అని శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని వేడుకున్నాడు.

ఆర్తితో భక్తులు పిలిస్తే ఆదుకునేందుకే అవతరించిన శ్రీనివాసుడు కృపాచార్యుడి ప్రార్థనలను మన్నించకుండా వుంటాడా!

కృపాచార్యుడి కోరిక విని కరిగిపోయాడు. కృపాచార్యుడు బసచేసిన హనుమత్ క్షేత్రంలోనే శ్రీ వేంకటేశ్వరస్వామి కృపాచార్యుడికి దర్శనమిచ్చాడు. కృపాచార్యుడి పూజలందుకుని కృపాచార్యుడిపై కరుణాకటాక్షాలను ప్రసాదించాడు.

అంతేకాదు –

"స్వామీ! నామాదిరే తిరుమలకు రాలేని వారికి వీలుగా మీరు యిక్కడే కొలువుదీరండి..." అనే కృపాచార్యుడి కోరికను మన్నించాడు. హనుమత్ క్షేత్రంలో కొలువుదీరేందుకు శ్రీ వేంకటేశ్వరుడు అంగీకరించాడు.

అంతే –

కృపాచార్యుడు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి అర్చామూర్తిని హనుమంతుల వారికి ముందువైపు ప్రతిష్ఠించాడు. పూజలు జరిపాడు.

తిరుమలకు వెళ్ళలేనివారు ఈ స్వామిని దర్శిస్తే తిరుమలను దర్శించిన ఫలం కలుగుతుందని కృపాచార్యుడు చెప్పడంతో పాటు తిరుమలకు వెళ్ళే

భక్తులు ముందుగా ఈ స్వామివారిని దర్శించుకుని వెళ్తే ఎటువంటి ఆటంకాలు లేకుండ తిరుమల యాత్ర పూర్తవుతుందనే ఆచారాన్ని కూడా కృపాచార్యులు ఏర్పాటు చేశారు.

కృపాచార్యుడికి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కృప కలిగిన ప్రాంతం కనుక ఈ ప్రాంతానికి 'కృపావతి', 'కృపానగరం' అనే పేరు ఏర్పడి కాలక్రమంలో కరుప, కుడప, కడపగా మారినదని చెప్పబడుతూ వుంది.

**జనమేజయుడి స్వప్నం... తిరుమల నుంచి స్వామి రాక...!**

కడప కైఫీయత్తులో దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరుడిని జనమేజయుడు ప్రతిష్ఠించినట్లుగా చెప్పబడింది. జనమేజయమహారాజు పరీక్షిత్తు మహారాజు కుమారుడు. పరీక్షిత్తు మహారాజు అర్జునుడి మనుమడు. అభిమన్యుడి కుమారుడు. పరీక్షిత్తు మహారాజు కూడా కొంతకాలం కృపాచార్యుడి వద్ద విద్యను అభ్యసించాడు. పరీక్షిత్తు మహారాజు అరవై సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. ధర్మబద్ధుడైన రాజుగా ప్రసిద్ధి చెందాడు. అటువంటి పరీక్షిత్తు మహారాజు ఒకరోజు వేటకు వెళ్ళాడు. ఒక జంతువును చూసి దానిని వేటాడేందుకు దానిని తరుముకుంటూ చివరకు శమీక మహాముని ఆశ్రమానికి చేరాడు.

ఆశ్రమానికి చేరిన పరీక్షిత్తు మహారాజు జంతువును గురించి శమీక మహర్షిని ప్రశ్నించాడు.

అయితే యోగసమాధిలో మునిగివున్న శమీకమహర్షి పరీక్షిత్తు మహారాజు రాకను గానీ, ప్రశ్నను గానీ గమనించలేదు. రాజుకు సమాధానం యివ్వలేదు. దీనితో ఆవేశానికి లోనైన పరీక్షిత్తు మహారాజు ప్రక్కనే చచ్చిపడి వున్న ఒక సర్పాన్ని తీసుకుని మహర్షి మెడలో వేసి ఆశ్రమాన్నించి వెళ్ళిపోయారు.

తర్వాత కొంత సేపటికి శమీకమహర్షి కుమారుదు 'శృంగి' ఆశ్రమానికి చేరుకుని తపస్సులో నిమగ్నమైవున్న తండ్రి మెడలో చచ్చి పడివున్న పామును చూసి కోపోద్రిక్తుడై -

"తపస్సులో మునిగివున్న నా తండ్రి మెడలో నిష్కారణంగా చనిపోయిన పామును వేసినవాడు ఒకవారం రోజుల్లో పాముకాటుకు గురై మరణించు గాక..." అని శపించాడు.

తపోనిద్ర నుంచి మేల్కొన్న అనంతరం జరిగిన విషయం తెలుసుకున్న శమీకమహర్షి ఈ విషయాన్ని పరీక్షిత్తు మహారాజుకు తెలిపాదు. పరీక్షిత్తు మహారాజు చింతిస్తూ ఒక ప్రత్యేక భవనాన్ని నిర్మించుకుని, అందులో శ్రీ శుకుని చేత పుణ్యకథలను చెప్పించుకుని వింటూ గడపసాగాడు. చివరకు ఏడవ రోజు పండిత వేషధారులైన సర్పాలు వచ్చి పరీక్షిత్తుకు పండ్లను కానుకగా యిచ్చారు. వాటిలో నుంచి పరీక్షిత్తు మహారాజు ఒక పండును తీసుకుని వాసన చూశాడు. అంతే - ఆ పండులో దాగివున్న తక్షకుడు వెలుపలకు వచ్చి పరీక్షిత్తు మహారాజును కరవడంతో మహారాజు మరణించాడు.

దీనితో తండ్రి మరణానికి తీవ్రంగా చింతించిన జనమేజయ మహారాజు తండ్రి మరణానికి కారణమైన సర్పజాతిని నిర్మూలించేందుకు సర్పయాగాన్ని ప్రారంభించాడు. సర్పములు వచ్చి హోమ కుండంలో పడి మాడిపోవడం ప్రారంభమైంది. దీనితో సర్పజాతి భయాందోళనలకు గురై జరత్కారువు (వాసుకి భార్య) వద్దకు వెళ్ళి ప్రార్థించారు. జరత్కారువు తన కుమారుడైన ఆస్తీకుడిని జనమేజయుడి యాగం మాన్పించమని ఆదేశించింది. ఆస్తీకుడు జనమేజయుడి వద్దకు వచ్చి తన పాండిత్యంతో మెప్పించి, యాగం మాన్పించాడు.

ఇలా సర్పయాగం చేసిన జనమేజయ మహారాజు అనేక ప్రాంతాలలో వైష్ణవాలయాలను, శివాలయాలను నిర్మింపజేశాడు. దేవతామూర్తులను ప్రతిష్ఠించి పూజలను నిర్వహించాడు. జనమేజయ మహారాజు ప్రతిష్ఠించినట్లుగా చెప్పబడే ఆలయాలు ప్రధానంగా రాయలసీమ ప్రాంతంలో అనేకం వుండడం విశేషం. అంతేకాదు జనమేజయమహారాజు అనేక తీర్థాలను, క్షేత్రాలను దర్శించాడు. స్వామివారలను సేవించి తరించాడు.

అలా వివిధ పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ జనమేజయమహారాజు తిరుమలకు చేరుకున్నాడు. శ్రీనివాసుడిని దర్శించాడు. పూజలు జరిపించాడు. ఆ రాత్రి తిరుమలలోనే బసచేశాడు. “నేను నిర్మించిన ఆలయాల్లో ఎక్కడా శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ప్రతిష్ఠించలేకపోయానే...” అని ఆలోచిస్తూ ఆ రాత్రి నిద్రలోనికి జారుకున్నాడు.

రాత్రి స్వప్నంలో శ్రీనివాసుడు సాక్షాత్కరించి –

“నేను అర్చారూపంలో దగ్గరలోని చెరువుకట్ట వద్ద వున్నాను. నన్ను గుర్తించి తీసుకువెళ్ళి ప్రతిష్ఠించు...” అని పలికాడు.

స్వప్నంలో నిద్రనుంచి మేల్కొన్న జనమేజయమహారాజు స్వామి వారినే స్మరిస్తూ... స్వామివారిని ఎక్కడ ప్రతిష్ఠించాలని ఆలోచిస్తూ గడిపాడు.

తెల్లవారింది. నిత్య కార్యక్రమాలను ముగించుకున్నాడు. తిరుమల స్వామి వారిని మరోసారి దర్శించుకుని మనసారా స్వామి వారికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

అనంతరం –

తన స్వప్న వృత్తాంతాన్ని జనమేజయమహారాజు తన పరివారానికి వివరించాడు. అందరూ కలిసి తిరుమలలోని చెరువు వద్దకు వెళ్ళి అన్వేషించారు. ఒకచోట పుట్టలాగా ఎత్తైన ప్రాంతం కనిపించింది. చెరువు

నుంచి నీరు తెచ్చిపోసి ఎత్తైన మట్టిదిబ్బను కరిగించారు. అంతే...! శ్రీనివాసుడి దివ్య మనోహర అర్చామూర్తి దర్శనమిచ్చాడు. మట్టిని తొలగించి ఆ మూర్తిని వెలుపలకు తీసి ఎక్కడ ప్రతిష్ఠించాలా? అని ఆలోచిస్తూ వున్న సమయంలో–

"ఇక్కడకు వాయువ్యంగా పదిఆమడల దూరంలో పుష్కరిణి, దానికి దగ్గరలో హనుమంతుడు వున్నాడు. అక్కడకు తీసుకువెళ్ళి ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించు..." అనే మాటలు వినిపించాయి.

జనమేజయుడు స్వామివారిని తీసుకుని అదృశ్యవాణి పలికిన స్థలాన్ని వెతుక్కుంటూ బయలుదేరి దేవుని కడప ప్రాంతానికి చేరుకున్నాడు.

పుష్కరిణిని దర్శించాడు. దగ్గరలో వున్న హనుమంతుడినీ దర్శించి నమస్కరించాడు. అనంతరం హనుమంతుల వారికి ముందువైపు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రతిష్ఠింపజేశాడు. ఆలయాన్ని పునరుద్ధరించాడు. పూజలు జరిగే ఏర్పాట్లు చేశాడు.

ఇలా జనమేజయ మహారాజు కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామిని ప్రతిష్ఠించాడు.

## ఎందరో పాలకుల సేవ

దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం ఘనమైన చరిత్రను స్వంతం చేసుకుంది. ఎన్నో రాజవంశాలు, ఎందరో చక్రవర్తులు, రాజులు, పాలకులు ఆలయాభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. ప్రధానంగా ఆలయం విజయనగర సామ్రాజ్య పరిపాలనా కాలంలో సంగమరాజుల కాలంలో నిర్మింపబడింది. హరిహర, బుక్కరాయల కాలంలో ఆలయం నిర్మింపబడింది. ఆలయ రంగమండపం విజయనగర చక్రవర్తుల కాలంలోనే కట్టించబడింది. సాళువ నరసింహరాయలు ఆలయాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. సాహితీ సమరాంగణ సార్వభౌముడుగా పేరు పొందిన

శ్రీకృష్ణదేవరాయలు (క్రీ.శ. 1509-1529) దేవుని కడప క్షేత్రాన్ని దర్శించుకుని స్వామివారిని సేవించి తరించడంతో పాటు అనేక కానుకలను సమర్పించాడు. ఆలయ ప్రాంగణంలో అనేక శాసనాలు లభ్యమయ్యాయి. ఇవన్నీ క్రీ.శ. 1516 నుంచి 1562 సంవత్సరాల మధ్యకాలం నాటివి. ఇవన్నీ దానశాసనాలే కావడం విశేషం. ఈ శాసనాల్లో స్వామివారి సేవలు, నివేదనలకు సమర్పించిన మడిమాన్యాలు, భూములు, ఆలయానికి అవసరమైన వంటసామగ్రి సమర్పణ వంటి వివరాలు వున్నాయి.

అయితే తర్వాతి కాలంలో 17వ శతాబ్దం తొలి అర్ధభాగంలో ఆలయం పునరుద్ధరింపబడినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మట్లి వంశ పాలకుడైన అనంతభూపాలుడు ఆలయాభివృద్ధికి కృషి చేశారు. గర్భాలయం, ముఖ మండపం, ఆళ్వారుల మండపాలను పునరుద్ధరించారు. ఆలయప్రాంగణంలో ఉపాలయాలను నిర్మింపజేశారు. ఆలయానికి ప్రాకారాన్ని నిర్మింపజేయడంతో పాటు ప్రధాన రాజగోపురాన్ని మట్లి అనంతభూపాలుడు క్రీ.శ. 1624వ సంవత్సర ప్రాంతంలో నిర్మింపజేశారు. దేవుని కడప ఆలయ రాజగోపురం, తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయ రాజగోపురం ఒకేసారి నిర్మింపజేసినట్లు చరిత్ర చెబుతోంది.

వైదంబులు, ఓరుగంటిరాజులు, వల్లూరు పాలకులు, సంబెట రాజులు కూడా స్వామివారిని సేవించి తరించి ఆలయాభివృద్ధికి కృషిచేశారు.

### మన్రో సేవ

ఆంగ్లేయుల పాలనా కాలంలో క్రీ.శ.1801-1807 మధ్య దత్త మండలాలకు కలెక్టర్‌గా పనిచేసిన ఆంగ్లేయాధికారి సర్ థామస్‌మన్రో ఆలయాభివృద్ధికి కృషి చేశారు. ఆయన రాజగోపురానికి మరమ్మత్తులు చేయించాడు. స్వామి వారిని దర్శించి సేవించి తరించాడు.

## మహాకుంభాభిషేక మహోత్సవాలు

1987వ సంవత్సరంలో ఆలయంలో జీర్ణోద్ధరణ చేసి మహాకుంభాభిషేకాన్ని నిర్వహించారు. 1987వ సంవత్సరం జూన్ నెల 6వ తేది నుంచి 8వ తేది వరకు మూడు రోజులపాటు ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలు అహోబిల పీఠాధిపతి 45వ జీయర్ శ్రీవణ్ శఠకోప శ్రీ నారాయణ యతీంద్ర మహాదేశికన్ స్వామీజీ వారి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంలో పడమర, ఉత్తర, తూర్పు, దక్షిణ గోపురాలు ప్రారంభింపబడ్డాయి.

## వాగ్గేయకారులు కీర్తించిన రాయడు

దేవుని కడపలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారిని క్రీ.శ. 14వ శతాబ్దంలో వైష్ణవాచార్యులైన శ్రీ వేదాంత దేశికులు దర్శించి కీర్తించాడు. పదకవితా పితామహుడైన తాళ్ళపాక అన్నమాచార్యులు దేవుని కడప శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించి 'కడపరాయుడు', 'వేంకటాద్రి కడపరాయుడు' అని కీర్తించాడు. కడపరాయుడిని గురించి పన్నెండు కీర్తనలనూ రచించారు. అలాగే మధురభక్తిపరుడు, అభినయాచార్యుడు అయిన క్షేత్రయ్య (క్రీ.శ. 1600-1680) కూడా స్వామివారిని గురించి కీర్తన రచించి సేవించడం విశేషం.

## తిరుమల తిరుపతి దేవస్థానం పాలనలోకి...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నడుస్తూవున్న దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని 2006వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వారు దేవస్థానంలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రాకారాన్ని పునర్నిర్మించారు. ఆలయ రంగమండపంలో జీర్ణోద్ధరణ కార్యక్రమాలను ప్రారంభించి, రంగమండపం పైకప్పుకు మరమ్మత్తులు చేశారు. అనేక నూతన సేవలను, ఉత్సవాలను ప్రవేశపెట్టారు.


తిరుమల తిరుపతి దేవస్థానం పాలనలోకి వచ్చిన దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూనే వుంది.

**దివ్యమైన ఆలయం...**

దేవుని కడపలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం పశ్చిమాభిముఖంగా విశాలమైన ప్రాంగణంలో శిల్పకళాశోభితమై విరాజిల్లుతూ దర్శనమిస్తుంది.

**పుష్కరిణి**


దేవుని కడపలో ఆలయానికి దగ్గరలో ఆలయం వాయువ్యదిశలో 'పుష్కరిణి' వుంది. దీనికి "హనుమత్ పుష్కరిణి" అని పేరు. స్థానికులు



'కోనేరు' అని వ్యవహరించే ఈ పుష్కరిణిని క్రీ.శ. 1442వ సంవత్సరంలో విజయనగర పాలకుడైన ప్రౌఢ దేవరాయలు నిర్మింప జేసినట్లు శాసనాలు వెల్లడిస్తూ వున్నాయి. విశాలంగా వున్న పుష్కరిణి మధ్యలో 'నీరాళి మండపం'

వుంది. ప్రాచీనకాలం నుంచి ఇందులో తెప్పోత్సవాలు జరుగుతూ వుండేవి. 1930వ సంవత్సరం వరకు ఈ పుష్కరిణిలో తెప్పోత్సవాలు జరుగుతూ వుండేవి. ఆ తర్వాత ఆగిపోయాయి. 1990వ సంవత్సర ప్రాంతంలో తిరిగి తెప్పోత్సవాలు ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానాలు దేవుని కడప ఆలయాన్ని స్వాధీనం చేసుకున్న అనంతరం 2016-17 సంవత్సరాలలో పుష్కరిణికి మరమ్మత్తులు చేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దింది. ఈ పుష్కరిణిలోనే ప్రతి సంవత్సరం తెప్పోత్సవాలు, బ్రహ్మోత్సవాల సమయంలో 'చక్రస్నానం'లు జరుగుతాయి.

**మహాద్వార రాజగోపురం**



పశ్చిమాభిముఖంగా వున్న ఆలయానికి నాలుగువైపులా ద్వారాలు వున్నాయి. వాటిపై గోపురాలు నిర్మింపబడి వున్నాయి. అందులో మహాద్వార రాజగోపురం అయిన పశ్చిమ గోపురం ఎత్తైన గోపురం. మిగతా గోపురాలు చిన్నవి. మహాద్వార రాజగోపురం సుమారు 80 అడుగుల ఎత్తున సమున్నతంగా అల్లంత దూరం నుంచే భక్తులకు దర్శనమిస్తూ వుంటుంది. ఈ గోపురం ఐదు అంతస్తులతో పై భాగంలో ఐదు గోపుర కలశాలు ప్రతిష్ఠింపబడి ఠీవిగా దర్శనమిస్తూ వుంటుంది. ఈ గోపురాన్ని క్రీ.శ. 1624వ సంవత్సరంలో మట్లిరాజు అనంతభూపాలుడు నిర్మింపజేశారు. 1801- 1807 మధ్యకాలంలోనూ, 1987వ సం॥లోనూ ఈ గోపురానికి మరమ్మత్తులు

జరిగాయి. భక్తులు ఈ గోపుర ద్వారంగుండా ఆలయ ప్రాంగణంలోనికి ప్రవేశిస్తారు.

## పాదమండపం



ప్రధాన రాజగోపుర ద్వారం నుంచి ఆలయ ప్రాంగణంలో అడుగు పెట్టగానే ఎదురుగా ప్రధాన ఆలయం దర్శనమిస్తుంది. ఆలయం ముందు వైపు పాదమండపం వుంది. నాలుగు స్తంభాలు, పైభాగంలో చిన్న గోపురం నిర్మింపబడి వున్న మండపంలో సుమారు రెండు అడుగుల ఎత్తున్న వేదికపై పాదాలు వున్నాయి. భక్తులు ముందుగా స్వామివారి పాదాలను తగిలి నమస్కరించుకుంటారు. పాదాలపై ఇత్తడి తొడుగు వేయబడి వుంది. ముందుగా ఈ శ్రీవారి పాదాలకు నమస్కరించుకొనడం వల్ల స్వామివారిని దర్శించిన ఫలం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు.

## బలిపీఠం - ధ్వజస్తంభం

ఇలా దివ్యమైన శ్రీవారి పాదాలను స్పర్శించి, నమస్కరించుకుని ముందుకు కదలగానే బలిపీఠం, ధ్వజస్తంభం వున్నాయి. ప్రాచీనమైన ధ్వజస్తంభం స్థానంలో ఇటీవలి కాలంలో టి.టి.డి. ఆధ్వర్యంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠింపబడింది. వీటి సమీపంలో తులసి మండపం వుంది.

## నాగదేవతలు

ప్రధాన గోపురం ద్వారా ఆలయ ప్రాంగణంలోనికి ప్రవేశిస్తూనే ఎడమవైపు అంటే ఆలయ ప్రాంగణంలో వాయువ్యం వైపున లక్ష్మీప్రదమైన నింబవృక్షం వుంది. ఈ వృక్షం క్రిందవున్న వేదికపైన నాగదేవతలు

కొలువుదీరి వున్నారు. నాగదేవతల మధ్యలో శివపార్వతుల గారాల తనయుడైన శ్రీ వినాయకుడు కూడా కొలువుదీరి వుండడం విశేషం. భక్తులు నాగదేవతలకు ప్రదక్షిణలు చేస్తారు. ఈ విధంగా ప్రదక్షిణలు చేయడం వల్ల సర్పదోషాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం.

## విష్వక్సేనుల వారి సన్నిధి

నాగదేవతలను దర్శించుకుని కొంత తూర్పువైపు ముందుకు వెళితే ఒక ఉపాలయం దర్శనమిస్తుంది. దక్షిణాభిముఖంగా వున్న ఈ ఆలయంలో శ్రీ విష్వక్సేనుల వారు కొలువుదీరి వున్నారు. విష్వక్సేనుడు శ్రీ వేంకటేశ్వర స్వామి సేనాధిపతి. విష్వక్సేనులవారు శంఖు, చక్రాలను ధరించి కొలువుదీరి పూజలందుకుంటూ దర్శనమిస్తాడు.

## వినాయకుడి సన్నిధి

శ్రీవిష్వక్సేనుల ఆలయం ప్రక్కనే మరో ఆలయం వుంది. దక్షిణాభిముఖంగా వున్న ఈ ఆలయంలో వినాయకుడు కొలువుదీరి వున్నాడు. వైష్ణవాలయంలో వినాయకుడు ప్రత్యేకంగా కొలువుదీరి వుండడం విశేషం.

## ఆండాళ్ సన్నిధి



శ్రీ వినాయకుడి ఆలయానికి ప్రక్కనే మరో ఆలయం దర్శనమిస్తుంది. ఈ ఆలయం పశ్చిమాభిముఖంగా వుంది. ప్రధాన ఆలయానికి ఉత్తరం వైపున ఆలయం వుంది. ముఖ మండపం, గర్భాలయాలను కలిగివున్న ఆ ఆలయ గర్భాలయంలో శ్రీ ఆండాళ్ అమ్మవారు స్థానక భంగిమలో కొలువు దీరి ఆరాధనలందుకుంటూ వుంది.

## సంతానవృక్షం

శ్రీ ఆండాళ్ అమ్మవారిని దర్శించుకొని ప్రదక్షిణగా ముందుకు సాగితే ఉత్తర గోపుర ద్వారం దాటగానే 'శమీవృక్షం' దర్శనమిస్తుంది. పవిత్ర దేవతా వృక్షమైన ఈ వృక్షం సంతానవృక్షంగా పేరుపొందడం విశేషం. సంతానం లేని వారు దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ఈ వృక్షానికి ప్రదక్షిణలు చేసి నమస్కారం చేసుకొనడం వల్ల సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ శమీవృక్షానికి ప్రదక్షిణ చేసి నమస్కారం చేసి ముందుకు సాగితే ఆలయం ఈశాన్యానికి చేరుకుంటాం.

## అధ్యయన మండపం

ఆలయ ప్రాంగణంలోని ఈశాన్యంలో అధ్యయన మండపం వుంది. ఇందులో ప్రతి సంవత్సరం ధనుర్మాసంలో అధ్యయనోత్సవాలను నిర్వహిస్తారు. శమీవృక్షానికి, అధ్యయన మండపానికి మధ్యలో ప్రాచీనకాలం నాటి బావి వుంది.

## తోట, వేణుగోపాలస్వామి

ఆలయ ప్రాంగణంలో ప్రధాన ఆలయానికి వెనుకవైపున తూర్పు ద్వారానికి సమీపంలో తోట వుంది. ఈ తోటలోనే శ్రీ వేణుగోపాలస్వామి వారి విగ్రహం వుంది. శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకుని ముందుకు సాగితే ఆగ్నేయభాగానికి చేరుకుంటాము.

## శ్రీవారి పోటు

ఆలయ ప్రాంగణంలో ఆగ్నేయంలో వంటశాల వుంది. దీనిని 'శ్రీవారి పోటు' అని పిలుస్తారు. శ్రీ స్వామివారికి నివేదింపబడే అన్నప్రసాదాలన్నీ ఈ వంటశాలలోనే తయారు చేయబడతాయి.

### ఆళ్వారుల మండపం

శ్రీవారి పోటు నుంచి కొంతముందుకు సాగితే ఆలయ దక్షిణ గోపురద్వారం దర్శన మిస్తుంది. దీనికి సమీపం లోనే దక్షిణ ప్రాకారాన్ని ఆనుకుని ఉత్తరాభిముఖంగా పెద్ద మండపం వుంది. ఈ మండపంలో వైష్ణవాచార్యులైన ఆళ్వారులు కొలువుదీరి వున్నారు. ఈ మండపంలోనే శ్రీ చెన్నకేశవస్వామి వారు కూడా కొలువుదీరి వున్నారు.



ఈ మండపానికి సమీపంలో వాహన మండపంలో బ్రహ్మోత్సవాల్లో ఉపయోగించే వాహనాలు వున్నాయి. ఇక ఆలయ ప్రాంగణంలో నైఋతివైపున ఆలయ పాలనా కార్యాలయం, ప్రక్కనే పెద్ద మండపం వున్నాయి. పశ్చిమ ద్వారగోపురం నుంచి ఆలయ ప్రాంగణంలోనికి ప్రవేశించి పాదమండపంలో పాదాలకు నమస్కరించి బలిపీఠం, ధ్వజస్తంభాలను దర్శించుకుని ప్రదక్షిణగా ఆలయం చుట్టూ తిరిగి మళ్ళీ పాదాల మండపానికి చేరుకుని ఇక ప్రధాన ఆలయంలోకి ప్రవేశిద్దాం...!

### గరుడాళ్వారు మండపం

ప్రధాన ఆలయానికి ఎదురుగా, ధ్వజస్తంభం తర్వాత గరుడాళ్వారు మండపం వుంది. గర్భాలయంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఎదురుగా

గరుడ మండపంలో గరుడాళ్వారు కొలువుదీరి నిత్యం స్వామివారిని సేవిస్తూ దర్శనమిస్తాడు.

**ప్రధాన ఆలయం**

శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం రంగమండపం, ముఖ మండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి వుంది. ఆ మండప విశేషాలను తెలుసుకుంటూ ముందుకు సాగుదాం.



**రంగ మండపం**

16 శిల్పశోభితమైన శిలాస్తంభాలతో నిర్మితమైన మండపమే - 'రంగమండపం'. రంగమండపం చుట్టూ సుమారు మూడు అడుగుల ఎత్తున అరుగులు నిర్మింపబడి వున్నాయి. మండపంలోనికి ప్రవేశించేందుకు పశ్చిమ, ఉత్తరం, దక్షిణం వైపుల అరుగుల మధ్యలో దారి వుంది. ఇక తూర్పువైపున వున్న దారి నుంచి ఆలయంలోకి ప్రవేశించే మార్గం వుంది. ఈ మండపం పైభాగంలో పశ్చిమ, ఉత్తర, దక్షిణం వైపుల వున్న గోపురాల వంటి మండపాల్లో దేవతామూర్తుల విగ్రహాలు కన్నులపండువగా దర్శనమిస్తాయి. పశ్చిమం వైపున శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణ ఘట్టానికి చెందిన శిల్పాలు దర్శనమిస్తాయి. ఉత్తరం వైపున శేషతల్పంపై శయనించి వున్న



శ్రీరంగనాథస్వామి వారి మూర్తులు వుండగా, దక్షిణం వైపున శ్రీకృష్ణభగవానుడి మూర్తులు దర్శనమిస్తాయి. ఇక మండపం లోపల వున్న స్తంభాలు శిల్పకళతో నయనానందకరంగా దర్శనమిస్తాయి. శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయస్వామి, బసవేశ్వరుడు శివలింగాన్ని పూజిస్తున్న శిల్పం, వీణాధారిఅయిన శ్రీసరస్వతీదేవి, తుంబురుడు, మృదంగం వాయిస్తున్న విద్వాంసుడు, నర్తకీమణులు, నాట్యగణపతి, వివిధ దేవతామూర్తుల శిల్పాలు వివిధ స్తంభాలపైన దర్శనమిస్తాయి. కాగా రంగమండపం మహామండపంగా పిలువబడే ముఖమండపానికి కలిసి లేకుండా విడిగా వుండడం విశేషం. మధ్యలో సుమారు మూడు అడుగుల స్థలం వుంది. స్తంభాలు, నిర్మాణశైలి వంటి వాటిని బట్టి ఈ మండపం విజయనగర సామ్రాజ్యకాలంలో నిర్మింపబడినట్లుగా తెలుస్తోంది. పూర్వం ఉత్సవాల సమయంలో ఈ మండపంలో సంగీత, నాట్యాల వంటి కళాకార్యక్రమాలు జరుగుతూ వుండేవి.

**మహామండపం**

రంగమండపం తర్వాత వున్నదే మహామండపం. దీనికే ముఖ మండపం అని కూడా పేరు. పదహారు స్తంభాలతో కూడిన మండపం



ఇది. ఈ మండపంలోని ఒక స్తంభంపై నమస్కార భంగిమలో వున్న దంపతుల విగ్రహాలు మలచబడి వున్నాయి. ఇవి ఆలయాన్ని నిర్మింపజేసిన రాజ దంపతులవి అయి వుంటాయని అంచనా. ఈ విగ్రహాల రూపురేఖలను బట్టి వీరు విజయనగర చక్రవర్తులు అయివుంటారని చరిత్రకారుల అంచనా. ఈ మండపంలోనే ప్రతిరోజు రాత్రి స్వామివారికి ఏకాంత సేవను నిర్వహిస్తారు. ఈ మండపానికి అనుసంధానంగా ప్రదక్షిణామండపం వుంది. అంతరాలయం, గర్భాలయాలకు చుట్టూ మహామండపాన్ని అనుసంధానం చేస్తూ ప్రదక్షిణామండపం వుంది. ఈ మండపానికి దక్షిణం వైపున కూడా ద్వారం వుంది. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ప్రదక్షిణామండపం నుంచి వచ్చి ఈ ద్వారం గుండా వెలుపలకు వచ్చి అమ్మవారి దర్శనానికి వెళ్తారు.

## ద్వారపాలకులు

మహామండపంలోనే మహామండపం నుంచి అంతరాలయానికి ప్రవేశించే ద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులైన జయవిజయుల నిలువెత్తు శిలావిగ్రహాలు వున్నాయి. జయ, విజయులు స్పష్టమైన మనోహర రూపంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటూ దర్శనమిస్తారు.

## అంతరాలయం

మహామండపం తర్వాత వున్న మండపం అంతరాలయం. 'అంతరాళం' అని కూడా పిలువబడే ఈ మండపం నుంచే భక్తులు స్వామివారిని దర్శించు కుంటారు.

## గర్భాలయం

అంతరాళం దాటితే లోన వున్నదే గర్భాలయం. ఈ గర్భాలయంలోని వేదికపైన స్థానక భంగిమలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారు కొలువుదీరి వున్నారు.

## శ్రీవారి మూలమూర్తి



గర్భాలయంలో రెండు అడుగుల ఎత్తున్న పీఠంపై సుమారు నాలుగు అడుగుల ఎత్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువుదీరి వున్నారు. స్వామి వారు చతుర్భుజుడై పై రెండు చేతులలో శంఖు, చక్రాలను ధరించి వున్నాడు. క్రింది రెండు చేతులు వరద, కటిహస్తాలుగా వున్నాయి. నుదుటిపై పెద్ద తిరునామంతో స్వామివారు దర్శనమిస్తారు. స్వామివారి వక్షస్థలంలో శ్రీవత్స చిహ్నంతో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు మలచబడి వుంది. స్వామివారి శిలామూర్తిపై యజ్ఞోపవీతములు, నాలుగు కంఠాభరణాలు సుందరంగా చెక్కబడి వున్నాయి. స్వామివారు దివ్య స్వర్ణా భరణాలు, పుష్పమాలలు ధరించి దివ్యమనోహర రూపంతో భక్తులపై కృపా కటాక్షాలను ప్రసరింపజేస్తూ దర్శనమిస్తారు. స్వామి వారిని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి అని ఆర్తితో పిలుస్తూ భక్తులు ఆరాధిస్తారు.

## శ్రీ ఆంజనేయస్వామి

గర్భాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి వెనుకవైపున గర్భాలయ వెనుకగోడకు చేరువగా శ్రీ ఆంజనేయస్వామి వారు కొలువుదీరి వున్నారు. సుమారు పది అడుగుల ఎత్తువున్న శ్రీ ఆంజనేయస్వామి వారు క్షేత్రపాలకుడు. శ్రీ ఆంజనేయస్వామి వారిని హారతి సమయంలో హారతి వెలుగుల్లో అర్చకులు భక్తులకు దర్శింపజేస్తారు.

## ఉత్సవ మూర్తులు

గర్భాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వారలతో పాటు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారల ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకోవచ్చు.

## శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం


శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామివారి దేవేరి ఆలయప్రాంగణంలో స్వామివారి ఆలయానికి ఎడమవైపున వున్న ప్రత్యేక ఆలయంలో కొలువుదీరి వుంది. ఈ ఆలయం కూడా పశ్చిమాభిముఖంగా వుంది. ముఖమండపం, అంతరాళం, గర్భాలయాలను కలిగివుంది. ముఖమండపం ద్వారం పైభాగంలో ఇరువైపులా రెండు ఏనుగులు తొండాలను ఎత్తిపట్టుకుని పుష్పాలతో అభిషేకిస్తూ వుండగా శ్రీమహాలక్ష్మిదేవి పద్మంపై ఆసీనురాలైన శిల్పం వుంది. ఈ శిల్పానికి ఇరువైపులా శ్రీ సరస్వతీదేవి, శ్రీ పార్వతీదేవి, వారికి ఇరువైపులా సానకభంగిమలో వున్న లక్ష్మీదేవి శిల్పాలు, రెండు చివరలా సింహాల విగ్రహాలు వున్నాయి. భక్తులు తలపైకెత్తి అమ్మవారికి నమస్కరించుకుని ముఖమండపం లోనికి ప్రవేశిస్తారు.

## ముఖమండపం

శ్రీ మహాలక్ష్మీదేవి ఆలయ ముఖమండపంలో మూడువైపులా భక్తులు కూర్చునేందుకు వీలుగా అరుగులు వున్నాయి.

**బల్లులు**

ముఖమండపంలోని పైకప్పుకు రెండు బల్లులు చెక్కబడి వున్నాయి. వీటిపై ఇత్తడి కవచం వేయబడివుంది. వీటిని తాకేందుకు వీలుగా క్రింద చెక్కబల్ల ఏర్పాటు చేయబడివుంది. భక్తులు ఈ బల్లులను తాకి నమస్కరించు కుంటారు. ఈ విధంగా ఈ బల్లులను తాకి దర్శించుకొనడం వల్ల దోషాలు తొలగిపోతాయని... బల్లి శరీరం మీద పడినా ఎటువంటి ఇబ్బందులు కలుగవని భావిస్తారు.



**అంతరాళం**

ముఖమండపం తర్వాత వున్న మండపం 'అంతరాళం'. ఇక్కడ నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు.

**గర్భాలయం**

అంతరాళం తర్వాత వున్నదే – గర్భాలయం. ఈ గర్భాలయంలో దేవుని కడప శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవేరి శ్రీ మహాలక్ష్మీదేవి కొలువుదీరి వుంది. అమ్మవారు ఆసీనమూర్తి. చతుర్భుజాలను కలిగివుంది. అమ్మవారు పై రెండు చేతులలో పద్మాలను ధరించి వుంది. క్రింది రెండు చేతులలో అభయ, వరదముద్రలు వున్నాయి. సుమారు మూడువందల సంవత్సరాల క్రితం అమ్మవారి మూలమూర్తి భిన్నం కాగా, అప్పుడే ప్రస్తుతం దర్శనమిస్తూ



వున్న మూర్తిని ప్రతిష్ఠింపజేశారు. ఈ అమ్మవారిని శ్రీమహాలక్ష్మీ దేవి, శ్రీ పద్మావతీదేవి అనే పేర్లతో పిలుస్తూ ఆరాధిస్తారు.

స్వామివారు, అమ్మవారలను దర్శించుకుని భక్తులు తృప్తిగా వెలుపలకు వస్తారు.

## ఉత్సవ వైభవం

దేవుని కడపలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానం వారి పర్యవేక్షణలో దినదినాభివృద్ధి చెందడంతోపాటు ఉత్సవాలు, ఊరేగింపులతో అంగరంగ వైభవంగా విరాజిల్లుతూ వుంది.

దేవుని కడప శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి జరిగే సేవలు, ఉత్సవాలను నిత్యోత్సవాలు, వారోత్సవాలు, మాసోత్సవాలు, సంవత్సరోత్సవాలు అని నాలుగు రకాలుగా విభజించవచ్చు.

## నిత్యోత్సవాలు

ప్రతిరోజూ క్రమం తప్పకుండా విధిగా జరిగే సేవలే – నిత్యోత్సవాలు.

**1. సుప్రభాతం :** శనివారం మినహా మిగతా అన్ని రోజులలో ఉదయం 6 గంటలకు "కౌసల్యా సుప్రజారామ..." అంటూ సుప్రభాతాన్ని పఠిస్తూ స్వామి వారిని మేల్కొలిపే సేవ. శనివారం మాత్రం ఉదయం ఐదున్నర గంటలకే ఈ సేవ జరుగుతుంది.

**2. సహస్ర నామార్చన :** సుప్రభాతం తర్వాత స్వామి వారి అలంకారం పూర్తయ్యాక జరిగే సేవ సహస్రనామార్చన. ఇందులో స్వామివారి సహస్ర నామాలను పఠిస్తూ తులసీదళాలు, పుష్పాలతో స్వామివారిని అర్చిస్తారు.

**3. మొదటి గంట :** ప్రతిరోజు ఉదయం 8 గంటలకు ఘంటానాదంతో స్వామి వారికి, అమ్మవారలకు ఏకాంతంగా నివేదన సమర్పిస్తారు.

**4. రెండో గంట :** ప్రతిరోజు ఉదయం 11 గంటలకు స్వామివారికి ఘంటా నాదంతో ఏకాంతంగా నివేదన సమర్పిస్తారు.

**5. మూడో గంట :** ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు స్వామివారికి ఘంటానాదంతో ఏకాంతంగా నివేదన సమర్పిస్తారు.

**6. ఏకాంతసేవ :** ముఖమండపంలో గొలుసులతో వేలాడదీయబడిన ఊయల మంచంపై స్వామివారి ఉత్సవమూర్తిని శయనింపజేసే సేవే ఏకాంతసేవ. ఈ సేవ ప్రతి శనివారం రాత్రి 8.30 నిమిషాలకు, మిగతా రోజులలో రాత్రి ఎనిమిది గంటలకు జరుగుతుంది.

**దర్శన వేళలు :**
1. ఉ॥ గం॥ 6.30 నుంచి 7.45 గం॥ వరకు
2. ఉ॥ గం॥ 8.30 నుంచి ఉ॥ 10.45 గం॥ వరకు
3. ఉ॥ గం॥ 11.30 నుంచి మ॥ 12.30 గం॥ వరకు
4. సా॥ గం॥ 3.30 నుంచి సా॥ 5.45 గం॥ వరకు
5. సా॥ గం॥ 6.30 నుంచి రా॥ 8.00 గం॥ వరకు

ప్రతి రోజూ మధ్యాహ్నం 12.30 నిమిషాలకు ఆలయాన్ని మూసివేసి తిరిగి సాయంత్రం 3.30 గంటలకు తెరుస్తారు. శనివారం మాత్రం తెరిచే వుంటుంది. శనివారం దర్శనం రాత్రి ఎనిమిదిన్నర గంటల వరకు వుంటుంది.

దర్శన సమయాల్లో భక్తులు శ్రీవారి, అమ్మవారి ఆలయాల్లో నిర్ణీత సొమ్మును చెల్లించి అర్చన చేయించుకొనవచ్చును.

## వారోత్సవాలు

వారానికి ఒకరోజు నిర్వహించే సేవలు, ఉత్సవాలే - వారోత్సవాలు.

### 1. అభిషేకం

ప్రతి శుక్రవారం ఆరున్నర గంటలకు శ్రీవారి మూలమూర్తిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలను కలిపిన జలాలతో అభిషేకం నిర్వహిస్తారు. నిర్ణీత సొమ్మును చెల్లించిన భక్తులు ఈ సేవలో పాల్గొనవచ్చు. ఈ సమయంలోనే అమ్మవారికి కూడా అభిషేకం జరుగుతుంది. అమ్మవారికి అభిషేకం ఏకాంతంగా జరుగుతుంది. భక్తులను అనుమతించరు.

### 2. గ్రామోత్సవం

ప్రతి శనివారం సాయంత్రం ఐదున్నర గంటలకు గ్రామోత్సవం జరుగుతుంది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి తిరువీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.

## మాసోత్సవాలు

నెలకు ఒక్కసారి నిర్ణీత సమయంలో జరిగే సేవలే మాసోత్సవాలు.

### 1. కల్యాణోత్సవం



ప్రతినెలా శ్రవణా నక్షత్రం నాడు ఉదయం పది గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. నిర్ణీత రుసుమును చెల్లించిన గృహస్థులు కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు.

వివాహం ఆలస్యమవుతూ వున్న వారు కల్యాణోత్సవంలో పాల్గొంటే వారికి త్వరలోనే వివాహం జరుగుతుందనీ, వివాహమైన దంపతులు

కల్యాణోత్సవంలో పాల్గొంటే వారి దాంపత్యం కలకాలం వర్ధిల్లుతుందని ప్రతీతి.

### 2. పునర్వసు నక్షత్రం

ప్రతినెలా పునర్వసు నక్షత్రం నాడు స్వామివారికి ప్రత్యేక అభిషేకం గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు.

### 3. ఉత్తర నక్షత్రం

ప్రతినెలా ఉత్తర నక్షత్రం నాడు శ్రీ పద్మావతీ అమ్మవారికి అభిషేకం ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తారు.

### 4. పుబ్బ నక్షత్రం

ప్రతినెలా పుబ్బనక్షత్రం నాడు శ్రీగోదాదేవి అమ్మవారికి అభిషేకం గ్రామోత్సవం జరుగుతుంది.

### వార్షికోత్సవాలు

సంవత్సరానికి ఒక్కసారి జరిగే ఉత్సవాలు కనుక వీటికి సంవత్సరోత్సవాలు, వార్షికోత్సవాలు అని పేరు. దేవుని కడప శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి వివిధ సంవత్సరోత్సవాలు కన్నుల పండువగా జరుగుతాయి.

### కోయిల్ ఆళ్వారు తిరుమంజనం

సంవత్సరానికి రెండుసార్లు దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కోయిల్ ఆళ్వారు తిరుమంజనం సేవను నిర్వహిస్తారు. ఆలయాన్ని, ఆలయంలో ఉపయోగించే పూజాసామగ్రి, ఉత్సవమూర్తులను శుద్ధిపరిచే కార్యక్రమమే ఈ సేవ. శ్రావణమాసంలో శ్రవణానక్షత్రానికి ముందు వచ్చే మంగళవారం మరియు మాఘమాసంలో బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే మంగళవారం ఈ సేవను నిర్వహిస్తారు.

## తెప్పోత్సవం

ప్రతి సంవత్సరం వైశాఖమాసంలో శుక్లపక్ష పూర్ణిమకు ముగిసేలా మూడు రోజులపాటు తెప్పోత్సవాలను నిర్వహిస్తారు. ఆలయ సమీపంలోని హనుమత్ పుష్కరిణిలో శ్రీదేవి, భూదేవి సమేతులైన శ్రీవారు తెప్పలపై ఆసీనులై విహరిస్తారు. సాయంత్రం కన్నులపండువగా మూడు రోజులపాటు ఈ సేవ జరుగుతుంది.

## పవిత్రోత్సవాలు

దేవుని కడప ఆలయానికి వచ్చే భక్తుల వల్ల గానీ, స్థానికుల వల్లగానీ, ఆలయ ఉద్యోగుల, సిబ్బంది వల్లగానీ ఆలయం అపవిత్రమయ్యే అవకాశాలు వుంటాయి. అంటే తెలిసీ తెలియక పోవడంవల్ల అపవిత్రత కలుగుతుంది. ఈ అపవిత్రతను పరిహరింపజేసే నిమిత్తం చేసే సేవే - పవిత్రోత్సవాలు. ప్రతి సంవత్సరం భాద్రపదమాసం శుక్లపక్ష ద్వాదశి నుంచి పూర్ణిమ వరకు నాలుగు రోజులపాటు జరుగుతాయి. మొదటి రోజు అంకురార్పణ, రెండవ రోజు పవిత్రప్రతిష్ఠ, మూడోనాడు పవిత్ర సమర్పణ, నాలుగవ రోజు పూర్ణాహుతి కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.

## ధనుర్మాసోత్సవాలు

ప్రతి సంవత్సరం ధనుర్మాసంలో ఆలయంలో తిరుప్పావై పఠనంతో పాటు అధ్యయనోత్సవాలు, ఆండాళ్ నీరాట్టోత్సవాలు జరుగుతాయి.

## బ్రహ్మోత్సవాలు

దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం మాఘమాసంలో శుక్లపక్ష పాడ్యమి మొదలు తొమ్మిది రోజులపాటు జరుగుతాయి. ముందురోజు సాయంత్రం సేనాధిపతి ఉత్సవం,



అంకురార్పణ కార్యక్రమాలు జరుగుతాయి. తొలిరోజు ఉదయం తిరుచ్చి సేవ అనంతరం జరిగే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఆరోజు రాత్రి నుంచి ప్రతిరోజూ ఉదయం, రాత్రి వాహనసేవలు జరుగుతాయి.

తొలినాటి రాత్రి చంద్రప్రభ, రెండవ రోజు ఉదయం సూర్యప్రభ, రాత్రి పెద్ద శేషవాహనం, మూడవ రోజు ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి సింహవాహనం, నాలుగవ రోజు ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనం, ఐదవ రోజు ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి గరుడవాహనాలను అధిరోహించి శ్రీవారు తిరువీధులలో ఊరేగుతూ భక్తులను కరుణిస్తారు.

బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజు ఉదయం బ్రహ్మోత్సవ కల్యాణోత్సవం కన్నులపండువగా జరుగుతుంది. ఆరోజు రాత్రి గజవాహన సేవ జరుగుతుంది.

బ్రహ్మోత్సవాలలో ఏడవ రోజు అయిన రథసప్తమి నాడు స్వామి వారికి రథోత్సవం, ధూళి ఉత్సవం జరుగుతాయి. ఎనిమిదవ రోజు ఉదయం సర్వభూపాల వాహనసేవ, రాత్రి అశ్వవాహన సేవ జరుగుతాయి. తొమ్మిదవ రోజు ఉదయం వసంతోత్సవం, చక్రస్నానంలు జరుగగా ఆనాటి సాయంత్రం జరిగే ధ్వజారోహణ, రాత్రి జరిగే హంసవాహన సేవతో బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా ముగుస్తాయి.

## రథోత్సవం



దేవుని కడప బ్రహ్మోత్సవాలలో రథోత్సవం ప్రధానమైనది. రథోత్సవం బ్రహ్మోత్సవాలలో ఏడవ రోజు రథసప్తమి రోజు జరుగుతుంది. ఈ ఉత్సవంలో లక్షలాది భక్తులు పాల్గొంటారు. ఈనాటి ఉదయమే పూజలు నిర్వహించి రథోత్సవానికి రథాన్ని సిద్ధం చేస్తారు. రంగురంగుల దుస్తులు, పుష్పమాలలను అలంకరిస్తారు. పై భాగంలో కలశాన్ని ప్రతిష్ఠించి, ఛత్రాన్ని ఏర్పాటు చేస్తారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని రథంపై వేంచేపు చేసి ప్రత్యేకపూజలను చేసి నివేదన సమర్పిస్తారు. తర్వాత భక్తులు రథాన్ని అధిరోహించి స్వామివారిని దర్శించు కుంటారు. ఇక, మధ్యాహ్న సమయంలో రథోత్సవం ప్రారంభమవుతుంది. దేవుని కడప, పాత కడపలకు చెందిన వారు రథాన్ని కదిలించడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు. రథోత్సవం సుమారు మూడున్నర గంటలపాటు సాగుతుంది. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే..." అనే ప్రతీతిని అనుసరించి రథోత్సవాన్ని, అందులో వున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని దర్శించుకుని భక్తులు తమ జన్మ తరించిందని భావిస్తారు.

## పుష్పయాగం

బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాతిరోజు దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారికి పుష్పయాగం జరుగుతుంది. రకరకాలైన పుష్పాలను ఉపయోగించి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు.



ఈ ప్రధాన ఉత్సవాలతో పాటు ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసంలో దేవీనవరాత్రుల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పూజలను నిర్వహిస్తారు.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు గరుడ వాహనాన్ని అధిరోహించి ఉత్తరద్వారం వద్దకు వచ్చి పూజలందుకుంటారు. ఉదయం నుంచి పదకొండున్నర గంటల వరకు స్వామివారు ఉత్తరద్వార దర్శనాన్ని భక్తులకు ప్రసాదిస్తారు.

వీటితోపాటు వివిధ పండుగలు, పర్వదినాలలో ఆలయంలో స్వామివారలకు ప్రత్యేక అలంకరణలు, పూజలను నిర్వహిస్తారు.

## ఎన్నో ప్రత్యేకతల ఉగాది

చైత్రమాసం శుక్లపక్ష పాడ్యమి “ఉగాది’. తెలుగువారు నూతన సంవత్సర ప్రారంభదినంగా జరుపుకునే ఉగాది దేవుని కడప ఆలయంలో ప్రత్యేకతల రోజు. ప్రతి సంవత్సరం ఉగాదినాడు అసంఖ్యాకంగా మహ్మదీయులు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పూజలు చేస్తూ వుండడం విశేషం. ప్రధానంగా స్థానిక ముస్లింలు ఆలయంలో కొలువుదీరిన శ్రీ పద్మావతి అమ్మవారిని తమ ఆడబిడ్డ ‘బీబీనాంచారి’గా భావిస్తారు. శ్రీవారిని తమ అల్లుడిగా గౌరవిస్తూ ఉగాదినాడు ఆలయాన్ని దర్శించి దినభత్యాలు సమర్పించుకుని కొబ్బరికాయలు కొట్టి స్వామివారిని దర్శించి పూజలు చేస్తూ వుండడం విశేషం. ప్రతి సంవత్సరం ఉగాదినాడు వేలాది

మంది ముస్లిం భక్తులు స్వామివారిని దర్శించి అర్చిస్తారు. ఇది మరేక్షేత్రంలో లేని, దేవుని కడపకు మాత్రమే స్వంతమైన ఆచారం.

ఈ విధంగా నిత్య, వార, మాస, సంవత్సరోత్సవాలతో... భక్తుల సందడితో దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం దినదినాభివృద్ధి చెందాలనీ, దర్శించిన, అర్చించిన భక్తుల ఇష్టార్థాలు నెరవేరాలని స్వామివారిని ప్రార్థించుకుందాం!!

**శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేఽర్థినామ్**
**శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥**

* * *

## కడపరాయుడిపై అన్నమయ్య కీర్తనలు

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ముప్పై రెండువేల కీర్తనలతో అర్చించిన పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుల వారు దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామిని దర్శించారు. కీర్తించారు. అన్నమయ్య దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారిని గురించి పన్నెండుకు పైగా కీర్తనలు రచించారు. ఈ కీర్తనలను ఈ సందర్భంలో స్మరించడం సముచితం.

### 1. శంకరాభరణం

కప్పురమందుకొంటిఁ గడపరాయ నీకుఁ
గప్పము మాజవ్వనము కడపరాయ ॥పల్లవి॥

కన్నుల మొక్కేనోయి కడపరాయ నా
కన్నెచన్నులేలంటేవు కడపరాయ
కన్నవారెల్లా నవ్వేరు కడపరాయ నాతో
సన్నలేల సేసేవు సారెఁ గడపరాయ ॥కప్పు॥

కలcగంటిc గదవోయి కడపరాయ యికc
గలcచకు మాసిగ్గు కడపరాయ
కలువల వేసేవేల కడపరాయ నీకు
మొలకనవ్వులతోడ మొక్కేc గడపరాయ ॥కప్పు॥

కరుణించి నన్నేలితి కడపరాయ నీ
గరిమలెల్లాcగంటి కడపరాయ
గరిడిసాముదతులc గడపరాయ నీకు
యిరవు శ్రీ వేంకటాద్రి యిట్టే కడపరాయ ॥కప్పు॥

**2. సాళంగనాట**

కాదనకు నామాట కడపరాయ నీకు
గాదcబోసే వలపులు కడపరాయ ॥పల్లవి॥

కప్పురమియ్యగరాదా కడపరాయా నీకుc
గప్పితి నాపయ్యెదెల్లc గడపరాయ
కప్పుమివే కుచములు కడపరాయా వో
కప్పుమొయిలు మేనిచాయ కడపరాయ ॥కాద॥

కందువకు రారాదా కడపరాయా ముందే
గందమిచ్చినవాcడవు కడపరాయ
కందము నీ మాటలికc గడపరాయా వో
కందర్పగరుcడ మొక్కేc గడపరాయా ॥కాద॥

కలిసితివిటునన్నుc గడప రాయా నా
కలనేcడు నిజమాయc గడపరాయ
కలదాననే నీకుc గడపరాయా వో
కలికి శ్రీ వేంకటాద్రి కడపరాయా ॥కాద॥

### 3. శంకరాభరణం

కానీవయ్య అందుకేమి కడపరాయ నేము
కానమా నీచేతలెల్లా కడపరాయా ॥పల్లవి॥

కప్పురపు నవ్వుల కడపరాయ నాకుఁ
గప్పవోయి పచ్చడము కడపరాయా
కప్పులుదేరీ నీమోవిఁ గడపరాయ యివి
కప్పముగా నెవ్వతిచ్చెఁ గడపరాయ ॥కానీ॥

గరగరనివాఁడవు కడపరాయ నాకుఁ
గరఁగి వలవవోయి కడపరాయా
కరుణించి నన్నంటగాఁ గడపరాయ నిన్ను
గరిసించే దెవ్వతోయి కడపరాయా ॥కానీ॥

కలువదండ నీకదె కడపరాయ నన్నుఁ
గలిసితి వింతలోనే కడపరాయా
కలికి శ్రీ వేంకటాద్రి కడపరాయ నీకు
గలదిఁక నెవ్వతోయి కడపరాయా ॥కానీ॥

### 4. ఆహిరి

జరపులనె ప్రొద్దువోయె చాలదాయిఁక
సరుసఁగడపరాయ చాలదాయిఁక ॥పల్లవి॥

కేరికేరి చెలినీవు కెలకెల నవ్వించగ
సారెకుఁజెమట జారె చాలదాయిఁక
గారవించి యాకె చేతఁగతలు చెప్పించుకోఁగా
సారపుఁ బెదవు లెండె చాలదా యిఁక ॥జర॥

సాజపుఁ బచ్చిమాటలు సతితోడ నాడఁగాను
జాజుకొనఁబులకించె చాలదాయిఁక
తేజమునఁ బానుపుపై తెగి సరసమాడగా
జాజుల కొప్పెల్లవీడె చాలదాయిఁక ॥జర॥

నిరతిఁజన్నులపై కిన్నెర వాయించగాను
సరి నిట్టూర్పులు రేగె చాలదాయిఁక
పరవశమై కూడగా భామను శ్రీ వేంకటేశ
సరుగఁ బంతము చెల్లె చాలదాయిఁక ॥జర॥

**5. మాళవిగౌళ**

ఏరా యిప్పుడు నా యెదుటఁ గడపరాయ
నారి నేను నిన్నెఱుఁగుదు నను నీవెఱుఁగుదువు ॥పల్లవి॥

పలుకులఁబదరకురా కడుఁబగటు చెలియనేను
చెలఁగి యే పనులు మనసునఁ
గలిగిన చేసిచూపుదువు గానా ॥ఏరా॥

తనిసితి నీకతల మఱి తగవుచెప్పనేల
వెనకటివలెనెకద నీ బాసలు వింటిఁగంటి నలనాడె
నగవులఁబనిలేదు యింక నాకు నీకుఁబోదు
వెగటువాయ ననుఁగడపరాయ శ్రీ వేంకటగిరిపై గూడితి ॥ఏరా॥

**6. రామక్రియ**

కాంతగలనాడు యేకాంతముల మాట శ్రీ
కాంతుడవు నీవు యిందు కొఱకు నా కాకలేల కడపరాయ ॥పల్లవి॥

మానవతి నీవు ననుమానమునఁ బెంచితినేడు
పూనినేమెంత పిలిచిన రావనుమానమేల కడపరాయ ॥కాంత॥

మారుఁడంతలోనె నీకుమారుఁడయ్యుండి
మారుకొనెఁజూడు సారెసారె నెడమాటలేల కడపరాయ
ఆడజెలిఁజూచి మారాడలేక నీవు
కూడితివి శ్రీ వేంకటగిరిపై గోరికమీరఁ గడపరాయ ॥కాంత॥

**7. ముఖారి**

కాంతునిఁదప్పకచూచి కన్నులెల్లా యట్టనాయె
యెంతయినా మానదు కాక యిఁక నేమిసేతునే ॥పల్లవి॥

తానిందాకా రానెందుకు దగ్గరి నే వాదుచేసి
పూనియెంత దిద్దినాను పోదుఁ గోపము
ఆనవెట్టి రమణుని యంగము పచ్చిసేసినా
మానదు నాచలమిఁక మరియేమి సేతునే ॥కాంతు॥

సారెఁబొంకినందుకు సంగడివారెల్లఁజూడ
చేరివాదానఁజిమ్మినా చింతవాయదు
కూరిమి నాసతినట్టె కుచములఁగుమ్మినను
తీరదుననెఁజేరి విధి నీకేమిసేతునే ॥కాంతు॥

ఆకడఁదామరాకైన యందుకు నెగడవెట్టి
వాకిటఁదన్నునాగి నావగపువోదు
కైకొని శ్రీ వేంకటాద్రి కడపరాయఁడు గూడె
వాక్కున నాడక మాన వడినేమి సేతునే ॥కాంతు॥

**8. పాడి**

మానవెప్పుడు నీ మాయలెల్లాను
నానిన నా సనుపులు నవ్వించీఁగాని ॥పల్లవి॥

వాలుక రెప్పలు నీపై వంచి నేనెంత లోఁచినా
తాలిమె చూపుదుగాక అత్తరించేవా
వాలాయించి రాతిగుండెవాఁడ వౌత యెఱుగుదు
పాలుమాలిన నాయాస పాయనీదుగాని ॥మాస॥

ఆయములు సోక మాటలాడి యంత కొసరిన
చాయకాడవె కాక సమ్మతించేవా
కాయకపు నీ సరిత గట్టిగా నేనెరుగుదు
పాయపు నా వేడుకలు పైకొలిపీఁగాని ॥మాస॥

చిమ్ముచు నీ కౌగిటిలో చేతలెంత సేసినాను
కుమ్మరించి నాతోను నీ గుట్టు చెప్పేవా
కమ్మటి శ్రీ వేంకటాద్రి కడపరాయఁడవై
నెమ్మదిఁ గూడితివిదె నిజమాయఁగాని ॥మాస॥

**9. దేసాళం**

సాకిరి మీరే సుండి సతులాలా
యీకడ నన్నే నేరాలెంచరాకురమ్మా ॥పల్లవి॥

వుడివోని తమకాన వొకటొక టాడవచ్చీ
తడవము తాఁకము తానేమొ వీఁడు
నడుమ నేనేమన్న నానోరె గనమె
వుడుకు నూరుపు తోడ నూనకుండేనమ్మా ॥సాకిరి॥

చిత్తిణి గుణముతోడ చేతులు చాఁచగవచ్చీ
బత్తిగల వానివలె పైపై వీఁడు
అత్తినేఁ గోపగించితే నందరు నన్నే దూరేరు
కొత్త నివ్వెరగు తోడ గూచుండే నమ్మా ॥సాకిరి॥

యెవ్వరి ముందరనైన యెమ్మెకే నవ్వగవచ్చీ
పవ్వళించాఁబోనీఁడు పదరివీడు
యివ్వలఁ గడపరాయఁడిదె శ్రీ వేంకటగిరి
నివ్వటిల్ల నన్నుఁగూడె నెయ్యమైతినమ్మా ॥సాకిరి॥

## 10. మధ్యమావతి

పొదిగి మమ్ము రేఁచక పోపో నీవు
పొదరులాడక నీవు పోపో నీవు ॥పల్లవి॥

గద్దరి నీ మాటలకు కదమొదలే లేదు
పొద్దువోయి నలసితి పోపో నీవు
అద్దలించి నన్నే నీవు అనవెట్ట వచ్చేవు
బుద్ధులంత నేరవు పోపో నీవు ॥పొదిగి॥

కదనున్న యాఁదువారి కాలుఁదొక్కవచ్చేవు
పొదవులు చూపక పోపో నీవు
విదువిదు నీసుద్ది వింతలా మాకేమి నీవు
పుదుకక మమ్మంత పోపో నీవు ॥పొదిగి॥

కెరలించకంతమమ్ము కేరి నీగుట్టే చాలు
పొరుగువారు నవ్వేరు పోపో నీవు
గరమి శ్రీ వేంకటాద్రి కడపరాయఁడ నన్ను
పురిగొనఁ గూడితివి పోపో నీవు ॥పొదిగి॥

## 11. శంకరాభరణం

కానీవే తనవేసాలు కనుగొంటిఁగా
వీనులకు యీసుద్దులు వెరగాయఁగా ॥పల్లవి॥

చెప్పరే చెప్పరే వీని చేఁతలు నాకు
అప్పుడే యాపెతో మాటలాడివచ్చెనా

ముప్పిరి నాకిఁక నేటి మొకమాటమే
తప్పని బొంకనివాఁడు తానెందువోయీనే ॥కానీవే॥

యెంతకంత వీనిసుద్దులేల దాఁచేరే
దొంతిగా నాపెను వెంటఁదోడితెచ్చెనా
పంతపు మోసములికఁ బనికిరావె
సంతసమే చేసేఁగాక జగడించేనా ॥కానీవే॥

యేమంటిరేమంటిరే యెఱగనేను
చేముట్టి యాపెను నాచేతికిచ్చెనా
కామించి శ్రీ వేంకటాద్రి కడపరాయడు నన్ను
గోమునఁగూడె నిదియుఁ గొంతవలెనా ॥కానీవే॥

## 12. సామంతం

అటువంటి వాఁడవో అద్దోనీవు
నటన మొకమోటాలు నడపేవుగాక ॥పల్లవి॥

తలఁపు లోపల నీకు తగులు గలిగితేను
అలరిరాకుండుదువా అక్కడ నీవు
చలముల నెవ్వతో జూగులఁబెట్టుక నిన్ను
వెలిలోను మఱిపించి వెట్టింజేసిఁగాకా ॥అటు॥

కడుఁ దమకము నీకుఁ గమ్మి పెరరేఁచితేను
అదరినాతో మాటలాడకుందువా
వడి నెవ్వతో నిన్ను వాకట్టు గట్టుక యింత
ముడివెట్టి విడిచి తామొప్పేఁజేసెఁగాకా ॥అటు॥

తటుకున నన్నుఁ గూడెదయ నీకు లేకుండితే
ఘటన నెదురుకొని కాఁగిలింతువా

యిటువలె శ్రీ వేంకటేశ కడపలోన
సటల కెవ్వతో నిన్ను చండిసేసెఁగాకా ॥అటు॥

* * *

## దేవుని కడప శ్రీ వేంకటేశ్వరస్వామిపై క్షేత్రయ్య రచించిన పదం

**పున్నాగవరాళి**

ఇందుకేమి సేతునమ్మా! యెవరు తోడితెచ్చెదరమ్మా
ఇందువదన! కడప వేంకటేశుడెంత దూరాననున్నాడో ॥ఇందు॥

ఎక్కువ మోహమున నన్ను ఏవేళఁగౌగిట జేర్చువా
డొక్కడే పవ్వళించియుండ - నోపునటవే?
పక్కలోన వెదకి కానక - ప్రాణేశుడెంత కలవరించెనో
మిక్కిలి విరహవేదన చేతఁ
జక్కని స్వామికి మేనెంత చిక్కెనో ॥ఇందు॥

నెలతరో! నాకెమ్మోవానక - నిమిషమైనఁదాళలేదు
యెలమి నొపొత్తునేగాని భుజియింప నొల్లడు
తెలియనైతి మా యిద్దఱి వలపు - దృష్టిదాకె నమ్మలార
వలరాజు నన్ను బాధించినట్ల నా
చెలువుని నేడెంత వెతలబెట్టెనో ॥ఇందు॥

పడితిరో! మువ్వగోపాలుడైన - కడప వేంకటేశునిగూడి
యెడబాయక యందునని - యెంచుకొంటి
తడయకేనొకటి తలచితే - దైవమొకటిఁ దలచినందుకు
తొడబడి నే తెగువ జేసెదనంటే
తొయ్యలి! వాడేమి చేసుకొనునో ॥ఇందు॥

* * *